

హైదరాబాద్ వార్త

# లేనివాళ్లను తీసేస్తున్నా..కొత్తవారిని చేర్చట్లేదు

- రేషన్ మ్యూటేషన్ కోసం దరఖాస్తుదారుల పడిగాపులు
- సంక్షేమ పథకాలకు కార్డు తప్పనిసరి చేయడంతో తిప్పలు
- కుటుంబసభ్యుల పేర్లు చేర్చేందుకు ఆఫీసుల చుట్టూ ప్రదక్షణలు



**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** నగరంలోని ఖైరతాబాద్ ప్రాంతానికి చెందిన రమేష్ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రేషన్ కార్డులో ఆఇద్దరు పిల్లల పేర్లు చేర్చాలని పౌరసరఫరాల వాఖ అధికారులను సంప్రదించగా .. వారి సూచన మేరకు మీసేవాలో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఆయనకు రెండున్నరేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. ఇప్పటివరకు రేషన్ కార్డులో వారి పిల్లల పేర్లు నమోదు కాలేదు. వాస్తవానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్దిపొందాలంటే అతని ఇద్దరు పిల్లల పేర్లు తప్పనిసరిగా ఉండాలి. అలా లేకపోవడంతో ప్రతి నెలా కొడుకుల కోటాకు సంబంధించిన రేషన్ బియ్యం పొందలేకపోతున్నాడు. ఓ సాధారణ ఉద్యోగి పరిస్థితి ఇలా ఉంటే కూలీ పనిచేసుకునే కుటుంబాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్క రమేష్‌కు ఎదరవుతున్న సమస్యే కాదు.. రాష్ట్రంలోని వేలాది మంది సమస్య. అలాగే, ఐదేండ్లలోపు ఉన్న పిల్లలపేర్లు కార్డుల్లో ఎక్కినా రేషన్ బంద్ చేసిన ప్రభుత్వం ..ఆపిల్లలకు 9ఏండ్లు వచ్చినా పునరుద్దరించపోగా కార్డులో నుంచి పేర్లనే తొలగించింది. ఇదేమని సంబంధిత అధికారులను అడిగితే మేమైతే తీయ లేదు..పేరు ఎలా పోయిందో మాకు తెలియదు. పేరుచెర్చడం కోసం దరఖాస్తు చేసుకోండి అని సమాధానం ఇస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం సుదీర్ఘ కాలం తర్వాత జూలై 2021లో కొత్తరేషన్ కార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే. కానీ పాతకార్డుల్లో మార్పులు చేర్పులు,చేర్చడం లేదు. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖకు హైదరాబాద్ జిల్లాల్లో తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 613 షాపుల్లో అన్నిరకాల రేషన్‌కార్డులు కలిపి 6.36 లక్షలు ఉన్నాయి. అయితే, పాత కార్డుల్లో ఎవరైనా కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటే ఆశాఖ ఆమోదం తెలపడం లేదు. ఫలితంగా ఎంతోమంది సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారు. ప్రధానంగా సిఎంఆర్ఎఫ్, ఉపకార వేతనాలు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, ఆసరా ఫించన్లు , కుల, ఆదాయ, ఈబిసి సర్టిఫికేట్లు వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డునే ప్రమాణికంగా తీసుకోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుంది. పాత రేషన్ కార్డులో అదనంగా కుటుంబ సభ్యులను చేర్పించడానికి పౌరసరఫరాల శాఖకు తొమ్మిది సర్కిళ్ల పరిధిలో ఏడేళ్ల కాలంలో దాదాపు లక్షలకు పైగా దరఖాస్తు చేసుకోగా సుమారు 85వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

**పేర్ల నమోదు నిరంతర ప్రక్రియ ..**

ఆహార భద్రతకార్డు కలిగిన కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే వారి పేర్లను రేషన్‌కార్డుల నుంచి వెంటనే తొలగించేస్తున్నారు. నెలలా వారికి వచ్చే కోటా బియ్యాన్ని కూడా ప్రభుత్వం మినహాయిస్తుంది. కానీ కొత్తసభ్యులను చేర్చే విషయంలో మాత్రం సానుకూలమైన నిర్ణయం తీసుకోవడం లేదు. కొత్త సభ్యులను చేర్పించడానికి మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నా ..కార్డుల్లో నమోదు చేయడానికి పౌరసరఫరాల శాఖ ఆమోదం తెలపడం లేదు. దీనివల్ల ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తీరుగుతున్నా ప్రయోజనంలేదు. ముఖ్యంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్ళిన వారు కార్డుబదిలీ కోసం ,పెండ్లి చేసుకుని పిల్లలు పుట్టిన వారి పేర్లు నమోదు చేసుకోవడం కోసం, పెండ్లి చేసుకుని అత్తవారింటికి వచ్చిన వారి పేర్లనమోదు కోసం ..మొదటినుంచి కార్డుల్లో పేర్లు నమోదు కాని వారు, విడిపోయిన కుటుంబాల వారు ఇలా వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారు. వీటన్నింటికి పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు ఆగాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. మరణించిన వారి పేర్లు రేషన్‌కార్డుల్లో నుంచి తొలగించినట్లుగానే ..కుటుంబంలో ఎవరైనా సభ్యులు చేరితే వారి పేర్లు ఎప్పటికప్పుడు చేర్చడం నిరంతరం ప్రక్రియగా కొనసాగాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో పాల్గొన్న మ ంత్రులు తలసాని, మహమూద్ అలీ, యాకుత్‌పుర తదితరులు

**చార్మినార్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునే విధంగా పాతబస్తీకి చెందిన బిఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హోంశాఖ మంత్రి మహమూద్ అలీతో కలిసి చార్మినార్, యాకుత్‌పుర, కార్వాన్, బహదూర్‌పుర, మలక్‌పేట్, నాంపల్లి, గోషామహల్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గాల బిఆర్ఎస్ ఇంఛార్జీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా సిఎం కేసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. గృహలక్ష్మి పథకంకింద పేదలకు ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షల రూపాయల ఆర్ధిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని, ప్రతీ నియోజకవర్గంలో మూడువేల మంది లబ్దిదారులు ఈ పథకంకు వర్తింప చేయన్నుట్లు ఆయన తెలియజేశారు. కుల వృత్తులపై ఆదార పడిన బిసి కులాలకు చెందిన అర్హులైన వారికి లక్ష రూపాయలు చొప్పున ప్రభుత్వం ఆర్దిక సహాయాన్ని అందిస్తున్నదని, అర్హులైనవారు వారంరోజుల్లోగా దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేయాలని ఆయన తెలిపారు. నియోజకవర్గాల బిఆర్ఎస్ ఇంఛార్జులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటానికి కృషి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్జెల నగేష్, యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, నియోజక వర్గాల ఇంఛార్జులు ఆనంద్ గౌడ్, నందు బిలాల్ వా య్స్, మీర్ ఇనాయత్ అలీ బాక్రీ, ఆజం అలీ, సామ సుందర్‌రెడ్డి, జీవన్ సింగ్, రాంరెడ్డి, సలావుద్దీన్ లోధీతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఉమ్మడి పౌరస్మృతి దేశ సమగ్రత, ఐకమత్యానికి గొడ్డలి పెట్టు




మాట్లాడుతున్న వేణుగోపాల్

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ఉమ్మడి పౌరస్మృతి దేశ సమగ్రత, ఐక మత్యానికి గొడ్డలి పెట్టువంటిదని సీనియర్ జర్నలిస్టు ఎన్.వేణుగోపాల్ చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశంలో 565 సంస్థానాలు ఉన్నాయని, అనేక జాతులు, అనేక భాషాలతో కూడిన సమాహారమైన దేశంలో ఉమ్మడి పౌర స్మృతి ఏ విధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకువస్తే రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుందన్నారు. అఖిల భారత మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో 'భిన్న సంస్కృతుల సమాహార భారతదేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌర స్మృతి అవసరమా?' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఊస్తేల సృజన అధ్యక్షత వహించారు. వేణుగోపాల్, ప్రముఖ సామాజిక నాయకురాలు ఖలీద్ పర్వీన్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. అలాగే సదస్సులో ఎఐటియుసి జాతీయ నాయకురాలు డా. బి.వి.విజయలక్ష్మి, సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.రజని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకురాళ్ళు పి.ప్రేమ్‌పావని, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, నళిని, ప్రమీల, జె.లక్ష్మి, విజయలక్ష్మి పడిత్, ఎ.లలితాదేవి, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ 22వ లా కమిషన్ ద్వారా ఉమ్మడి పౌరస్మృతిపై దేశ ప్రజల నుంచి అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం కోరిందని, అయితే పౌరస్మృతికి సంబంధించిన ప్రతిపాదనలు మాత్రం గోప్యంగా ఉంచిందని ఆరోపించారు. 80 లక్షల మంది వరకు అభిప్రాయాలను తెలిపారని, ఇందులో 75 లక్షల మంది బిజెపి, ఆర్ఎస్ఎస్ వారే ఉన్నారని, వలస పాలకులైన బ్రిటిషువారు సైతం పౌరస్మృతి సిద్ధం చేశారన్నారు. కాని దేశంలో భిన్న పరిస్థితులను పరిశీలించిన తరువాత ప్రతిపాదనలు వెనక్కి తీసుకున్నారని చెప్పారు. ఖలీద్ పర్వీన్ మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి పేరుతో ముస్లిం సమాజంలో కేంద్ర ప్రభుత్వం అలజడి సృష్టిస్తున్నదని ఆరోపించారు. మను ధర్మాన్ని ఆదివాసీ గిరిజన దళితులు నెత్తిన రుద్దేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.

## 20న భవ్య కావడి శోభా యాత్ర

**చార్మినార్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** భాగ్యనగర్ కావడి సేవా సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆగస్టు 20వ తేదీన భవ్య కావడియాత్రను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు మంగేరామ్ తాహెల్ తెలిపారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని 26వ భవ్య కావడి యాత్ర సందర్భంగా గురువారం సంఘం ప్రతినిధులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాంగేరామ్ తాహెల్ మాట్లాడుతూ ఆగష్టు నెల 20వ తేదీ ఆదివారం ఉదయం ఆరున్నర గంటలకు చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి కావడి యాత్ర ప్రారంభమై ఘాన్సీ బజార్, బహదూర్‌పుర ప్రాంతాలు మీదుగా సిలబ్రేషన్ కన్వేషన్‌కు చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులు సురేంద్ర అగర్వాల్ కావడి యాత్ర వెళ్లె మార్గం గురించి వివరించారు. ఈ సమావేశంలో మహిళా అధ్యక్షురాలు రుబీమిశ్రా, ఉపాధ్యక్షురాలు మీను గుప్తా, ప్రచార మంత్రి నందగోపాల్ భట్టడ్, ప్రతినిధులు పంకజ్ వర్మ, ఓంప్రకాష్ అగర్వాల్, భరత్ అగర్వాల్, కునాల్ గోయల్, రితేష్ మోదీ, రచనా కోఠారి, మహిమాతో పాటు పలువురు పాల్గొన్నారు.

# మెట్రో స్టేషన్ల కిందే సిట్టింగ్

### అడ్డంగా బుక్కైన మందుబాబులు



**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త**

నగరంలో మందుబాబులఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. మందేస్తే చిందే అన్నట్లు మందుబాబుల ఆగడాలు నగరంలో మితిమీరుతున్నాయి. అర్థరాత్రి అయిందంటే మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఫుల్‌గా తాగి రోడ్డుపై హల్‌చల్ చేస్తూ..ప్రజలను, పోలీసులకు తలనొప్పిగా మారుతున్నారు. మద్యం తాగి పోలీసులకు సవాల్ విసురు తున్నారు. పబ్లిక్ ప్లేసులే అడ్డాగా మార్చుకుంటూ ముందు కొడుతున్నారు. మనల్ని ఎవర్రా అపేది అంటూ మెట్రో జనావాసాల్లో మందు తాగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

కాగా హైదరాబాద్ మెట్రో నిత్యం లక్షల మందిని వారి గమ్యస్థానాలకు చేరవేస్తుంది. చిన్న వ్యాపా రులు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు నగరంలోని ఒక మూల నుంచి మరో మూలకు ప్రయాణించే కుటుంబాలకు ఇది సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అయితే ఇలాంటి మెట్రో స్టేషన్లు కొన్ని సంఘవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డంకులుగా మారుతున్నాయి. యువ జంటల లిఫ్ట్‌లో టిక్ టాక్ డాన్స్‌లు, ఇన్‌స్టా రీల్స్, కౌగిలించుకోవడం, ముద్దులు పెట్టకోవడంవంటి సంఘటనలు వెలుగు చూసిన సంగతి తెలిసిందే.ప్రయాణికుల అభ్యర్థన మేరకు మెట్రో అధికారులు ఇలాంటి మోసాలపై సీరియస్‌గా చర్యలు తీసుకుని తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల పంజాగుట్ట మెట్రో స్టేషన్ పరిధిలో ఇద్దరు యువకులు పట్టపగలు గ్లాసులో మందు కలిపి తాగుతున్న వీడియో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. మంత్రి కెటిఆర్, తెలంగాణ పోలీసు లకు ట్యాగ్ చేస్తూ ఓ నెటిజన్ వీడియో షేర్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది మరిచిపోకముందే యూసుఫ్‌గూడ మెట్రో స్టేషన్ పరిధిలోనూ కొందరు యువకులు పట్టపగలు డ్రగ్స్ సేవిస్తున్నారు. స్టేషన్‌కి ఇరువైపులా ఏర్పాటు చేసిన బెంచీల మీద దర్జాగా కూర్చుంటున్నారు. మెట్రో స్టేషన్లంటే పర్మిట్ రూమ్స్‌లుగా భావించి ఎలాంటి సందేహం లేకుండా మందు కొడుతున్నారు. పక్కనే గుడి ఉన్నప్పటికీ అటుగా వచ్చే ప్రయాణికులకు ఇబ్బం దులు కలుగుతున్న సంబంధంచిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరస్‌గా మారాయి. వీటిని చూసిన పలువురు ప్రయాణికులు మెట్రో స్టేషన్ల నిర్వహణపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. మెట్రో స్టేషన్ల దగ్గర వైన్స్, బార్లు ఉండడంతో మందు బాబులు రెచ్చిపోతున్నారు. మెట్రో స్టేషన్ల కింద కూర్చున్నారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే బాలికలతోపాటు వివిధ పనులకు వెళ్లే మహిళలు, కుటుంబ సమేతంగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సమస్యలు పరిష్కరించడంలో జాప్యం వద్దు

### రెవెన్యూఅధికారుల సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** సమస్యలుపరిష్కరించడంలో ఎలాంటి జాప్యం ఉండకూదని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రాముఖ్యతను గుర్తించి అధికారులు పనిచేయాలని ప్రతి సమాచారాన్ని వాట్సాప్ మెస్సేజ్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. ఏదైన అత్యవసర సమయంలో డైరెక్టుగా సమాచారాన్ని కలెక్టర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావాలన్నారు. అధికారులు రెవెన్యూ సంబంధిత పనులే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేయాల్సి ఉంటుందన్నారు.ప్రతి 15రోజులకోసారి రెవెన్యూ అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రధాన్యత పథకాలైన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి, దళిత బంధు, బిసిబంధు, మైనార్టీ బంధు పథకాలపై త్వరగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలు సమర్పించాలని కోరారు. అలాగే ల్యాండ్‌బ్యాంక్ నవకరణ కొరకు ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ ,కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి శిథలావస్థలో ఉన్న వాటిని గుర్తించి తెలపాలని కోరారు. అలాగే ప్రభుత్వ పథకాలైన సిఎంఆర్ఎఫ్, సాధిముబారక్, కళ్యాణలక్ష్మి, పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను తక్షణమే అఫిడవిట్లు దాఖలు చేయాలని జిపితో మాట్లాడి కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ రికవరీలై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పీవో 58,59లను అమలు పర్చడంలో ఎలాంటి ఉపేక్ష వహించవద్దని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూధన్, తహసీల్దార్లు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# బస్సు యాత్రను విజయవంతం చేయాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా



మాట్లాడుతున్న సాయిబాబా

**ధర్నాచౌక్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికై ఈనెలాఖరులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ చేపడుతున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా పిలుపునిచ్చారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. 1200ల మంది అమరవీరుల సమాధులపై పునాదులు వేసుకుని భవంతులు నిర్మించుకుని కేసీఆర్ కుటుంబం కులుకుతోందని మండిపడ్డారు. కేసీఆర్ దొరతనాన్ని, అవినీతి పాలనను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, రాబోయే ఎన్నికలలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ పార్టీ పునర్వైభవమే ప్రధాన లక్ష్యంగా చేపడుతున్న బస్సు యాత్రలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, కార్యదర్శి శ్రీకాంత్ ముదిరాజ్, సత్యనారాయణ, రవిగౌడ్, నర్సింహగౌడ్, యాదగిరి, సుధాకర్ పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్‌కు కీలకం

### హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గౌతమ్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఆలక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్.గౌతమ్‌రావు సూచించారు. ఈమేరకు గురువారం అంబర్‌పేట్ పోలీస్ బాయ్స్, సిసిఎల్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సుమారు 1000మందికి ఒక్కొక్కరికి 5పుస్తకాల చొపున 5వేల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ నేటి విద్యారినతలే రేపటి భవిష్యత్‌కు కీలకం అనే విషయాన్ని గుర్తించి, ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చదువులో చురుకైన పాత్రను పోషించాలన్నారు. విద్య ద్వారా తెలిపి పెరుగుతుందని,కావున విద్యార్థులంతా ఒక విదన్యను మాత్రమే నమ్ముకుంటే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోచ్చునని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల నుంచి విద్యలో ప్రమాణాలను పెంచిందని సద్వినియోగం చేసుకుని సమాజంలో గొప్ప వారిగా ప్రసిద్ది గాంచాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర నేత ఆనంద్‌గౌడ్, గోల్నాక డివిజన్ కన్వీనర్ రవీందర్‌గౌడ్, అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు నాగభూషణ్ చారి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో గౌతంరావు, ఆనంద్‌గౌడ్, రవీందర్‌గౌడ్ ,నాగభూషణ్‌చారి తదితరులు



గోల్కొండ కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ కిరణ్‌కారే

## గోల్కొండ కోటలో పటిష్టమైన బందోబస్తు

**మెహిదీపట్నం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** గోల్కొండ కోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబవుతుంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు కోటలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15న జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గోల్కొండ కోటలో జాతీయ పథాకాన్ని ఎగురవేస్తుందడడంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను గురువారం సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కారే పరిశీలించారు. ప్రముఖుల గ్యాలరీలతో పాటు సందర్శకులు కూర్చునే స్థలాలను పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండ తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ అశ్వాక్, గోల్కొండ ఏసీపీ ఫైయాజ్, ఆసీఫ్‌నగర్ ఏసీపీ రాజావెంకటొరెడ్డి, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ శ్రీనివాస్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ నీరంజన్‌రావు, టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, గోల్కొండ కోట ఇన్‌చార్జ్ ఎం.నవీన్‌కుమార్ వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

# నగరాభివృద్ధికి సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ పెద్దపీట

### నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



మల్లాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే తదితరులు

**నాచారం, ఆగస్టు 10 ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల సహకారంతో నగరాభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 738 కోట్ల పనులు చేయగా అందులో రూ. 122 కోట్లు ఉప్పల్ నియోజక వర్గానికి కేటాయించడం జరిగిందని మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని భవానినగర్ కమాన్ వద్ద రూ. 73 లక్షలతో బాక్స్ కల్వర్టు పనులకు, బ్రహ్మపురి కాలనీలో రూ. కోటి 70 లక్షల వ్యయంతో బాక్స్‌డ్రైన్ పనులకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి పనులకు శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ ఎస్ఆర్‌డీపీ కింద రూ.8 వేల కోట్లతో 38ప్రాజెక్టులను తీసుకున్నామని ఇప్పటికే 27 పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. మల్లాపూర్ ముంపు ప్రాంతం ఉండేదని అధిక నిధులకు కల్వర్టు, బాక్స్‌డ్రైన్, మంచినీటి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న బీఆర్ఎస్‌కు మరోసారిగెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఎమ్మెల్యే భేతిసుభాష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రణాళి బద్ధంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. మంత్రి కెటిఆర్ సహకారంతో అధిక నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో మురుగు, వర్షపు నీటి వ్యవస్థ, తాగునీరు, రోడ్లకు ప్రాధాన్యతనిచ్చి అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కారొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఏఎంహెచ్ఓ స్వప్నారెడ్డి, ఈఈ హరిలాల్, డిఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్స్‌పెక్టర్ రాము, బిక్షపతి, శానిటేషన్ అధికారులు వాసుదేవ్ గౌడ్, కుంతి కృష్ణ, ప్రవీణ్, రాపోల్ సతీష్, మల్లేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్ జెర్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## క్రీడలు మానసిక, శారీరక ధృడత్వానికి తోడ్పడతాయి

**నాగులూరి సాయిబాబా**

**సికింద్రాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇన్విటేషనల్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్ జెర్సీని అసోసియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా గురువారం ఆవిష్కరించారు. చిలకలగూడ నాగులూరి జీహెచ్ఎంసీ పార్కులో జరిగిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ మానసిక, శారీరక దృడత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తన తండ్రి నాగులూరి నర్సింహా జ్ఞాపకార్థం షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోసియేషన్ సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ పేర్లతో రూపొందించిన జెర్సీని ఆవిష్కరించారు. మూడు విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డ్‌లతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యాక్రమంలో ఎస్ఎస్ఆర్ ప్రతినిధులు రాజీవ్ అనిల్‌కుమార్, రఘునందన్, జితేంద్ర, స్వామి, రాంబాబు, శేఖర్, బాలరాజు, ప్రవీన్, శ్రీనివాస్, మున్నా, శశాంక్, నీలిమా, రమాదేవి, సువర్ణ, హాసిని, నస్రీన్, సౌజన్య, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

## నేడు మహాకాళీ అమ్మవారికి సాక సమర్పణ

**బేగంపేట ఆగస్టు 10,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారికి నేడు(మూడవ శుక్రవారం) సాక సమర్పించనున్నట్లు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలియజేసారు. ఆషాడ బోనాల జాతర సమయంలో అమ్మవారు ఐదు వారాలపాటు సాక సమర్పించాలని కోరిన నేపథ్యంలో జూలై 28న, ఆగస్టు 4న అమ్మవారికి సాకను అత్యంత వైభవంగా సమర్పించారు. మూడవ శుక్రవారం ఉదయం 9 గంటలకు భక్తుల సమక్షంలో అమ్మవారికి సాక సమర్పించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో జంటనగరాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని మనోహర్ రెడ్డి కోరారు.

## బిజెపి ఫిషరీస్ కమిటీలో నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న శ్యామ్‌సుందర్‌గౌడ్

**సికింద్రాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేపి నేతలకు ఫిషరీస్ విభాగంలో పదవులు కల్పించారు. మహంకాళి జిల్లా మున్సిపల్ కన్వీనర్‌గా నగరపు శ్యామ్, కో కన్వీనర్‌లుగా మూట గణేష్, అల్లాడి కరుణాకర్ పటేల్‌లను బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్ నియమించారు. గురువారం వీరికి ఇందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ కార్యాక్రమంలో మహంకాళి జిల్లా ప్రధానకార్యాదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బిసిల వాటా బిసిలకే ఇవ్వాలి

**జాతీయ బిసి సంక్షేమ సంఘం**



చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న గుజ్జ సత్యం తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** చట్టసభల్లో బీసీలకు వాటా బీసీలకే ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ గురువారం గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర మంత్రి రాందాస్ అథ్‌వాలేను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. బీసీల సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తాననిన కేంద్ర మంత్రి హామి ఇచ్చినట్లు గుజ్జ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ప్రజాస్వామ్యబద్ధంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక,రాజకీయ రంగాల్లో న్యాయం జరుగడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ, అంజి, అనంతయ్య, వేణుమాదవ్, కిరణ్, వంశీ, మురళీ, భూమన్న యాదవ్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 13 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం



తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని కురుమబస్తీలో నీటి సమస్య పరిష్కారానికి రూ. 13 లక్షలతో వేయనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బస్తీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**సిబిఎస్‌సి అకాడమీ డైరెక్టర్ జోసెఫ్ ఇమ్మానియేల్**

**నిజాంపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సిబిఎస్సీ అకాడమిక్ డైరెక్టర్ జోసెఫ్ ఇమ్మానియేల్ అన్నారు. స్టేట్‌లెవల్ నేష్నల్ ఎడ్యుకేషన్ పాలసి కాన్ఫరెన్స్, లైఫ్‌స్కిల్స్ సమ్మిట్లో భాగంగా బాచుపల్లి సిల్వర్‌ఓక్స్ పాఠశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండి ఓ గమ్యాన్ని ఏర్పరుచుకొని దాన్ని సాధించుకునే దిశగా పయనించాలన్నారు. అయితే పాఠశాలలో విద్యతో పాటు సామాజంలో జరుగుతున్న అంశాలపై పట్టుసాధించాలన్నారు. సామాజిక స్పృహా కలిగి ఉన్నప్పుడే మీకు ఏరంగంలో ఉన్న ఏప్రదేశంలోనైనా నిలదొక్కుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, ప్రస్తుత సామాజిక నడవడికపై అవగాహన కల్పిస్తున్న యాజమాన్యానికి, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిసిపి వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని ధర్నా

**సైఫాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:**

ఎఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడిన సెంట్రల్‌జోన్ డిసిపి ఎం.వెంకటేశ్వర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున విద్యార్థి, యువజనులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణికంఠరెడ్డి, పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని బుధవారం ఎఐఎస్ఎఫ్‌కు చెందిన విద్యార్థులు శాంతియుతంగా చలో సచివాలయం ముట్టడి కార్యక్రమం చేపడతుండగా లిబర్టి వద్ద పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. అడ్డుకున్న పోలీసులు విద్యార్థిలను విచ్చణ రహితంగా దాడి చేసి ఆరుగురు విద్యార్థులను తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. ముఖ్యంగా సెంట్రల్ జోన్ డిసిపి ఎం.వెంకటేశ్వర్లు విద్యార్థులపై తీవ్రంగా దాడి చేశారని, తక్షణమే ఆయన్నీ సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కారించడంతోపాటు వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసేంతవరకు విద్యార్థి, యువజనులు ఆందోళన చేపడతారని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, హైదరాబాద్ జిలా కార్యదర్శి జావిద్, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.




అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల కార్యకర్తలు

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే

**నిజాంపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదేశించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో కొనసాగుతున్న ఎస్ఎన్‌డిపి నాలాపనులతోపాటు ఫ్లైవర్ పనులను గురువారం మేయర్ కొలన్ నీలారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. రైసినీయా ఇంటెలిపార్క్ క్లబ్‌హౌజ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఎన్‌డిపి నాలా, ఫ్లైవర్ పనులను సకాలంలో పూర్తిచేస్తామన్నారు. మౌళికవసతుల కల్పనకు ఎన్ని నిధులైన కేటాయించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఆయా కాలనీవాసులు ఎదుర్కోంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరగా పరిష్కరిస్తామన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిందిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమీషనర్ రామక్రిష్ణరావు, ఎస్ఇ.సత్యనారాయణ, ఫ్లోర్‌లీడర్ ఆగం పాండుముదిరాజ్, కార్పొరేటర్లు ఆగం రాజు ముదిరాజ్, విజయలక్ష్మీ, దివాకర్, సురేష్‌రెడ్డి, గాజుల సుజాత,బాలాజీనాయక్, శ్రీనివాస్‌యాదవ్, ఎన్ఎంసి అధ్యక్షులు రంగరాయ ప్రసాదవ్, నాయకులు రవికాంత్, జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరీ, చందు, సునీల్‌రెడ్డి, సతీష్, ఆయా డివిజన్ల అధ్యక్షులు, కాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



నాలా పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు



బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్దం చేస్తున్న దృశ్యం

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**తార్నాక, ఆగస్టు 10 ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో సీఎం కేసీఆర్‌పై, తెలంగాణ ప్రభుత్వంపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం సాయంత్రం బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో బండి సంజయ్ దిష్టి బొమ్మతో శవయాత్ర నిర్వహించి దగ్దంచేశారు. ఈ కార్యక్రమానికి హాజరై డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాల హాయాంలో రైతులు దిక్కులు చూస్తే సీఎం కేసీఆర్ దీక్షాదక్షతతో అన్నదాతలకు ఆత్మగౌరవం పెరిగిందన్నారు. 24 గంటల కరెంటుపై అటు కాగ్రెస్, ఇటు బీజేపీ నాయకులు అవాకులు చెవాకులు చేస్తున్నారని ఆరోపించారు. ఏ అంశంపై వారు మాట్లాడలేని పరిస్థితి నెలకొనడంతో అన్నదాతలను రెచ్చగొట్టేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఉద్యమ జీవితం, ఆయన కష్టాలు తెలంగాణ ప్రజలందరూ గుర్తెరిగిన వారే అన్నారు. అనుచిత వ్యాఖ్యలతో పబ్బం గడుకుపోవాలని చూస్తే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో కాలం చెల్లినట్లే అని హెచ్చరించారు.

## మోతినగర్‌లో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** మోతీనగర్‌లో వాసవీ కమ్యూనికేషన్ నిర్వాహకులు శ్రీనువాస్‌గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, టూరిజం కార్పొరేషన్ తెలంగాణ చైర్మన్ ఉప్పల శ్రీనువాస్‌గుప్త, మాజీ డిప్యూటీ మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌లు పాల్గొన్నారు. దాదాపు 1000మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. టెలిఫోన్ రంగంలో 30సంవత్సరాలుగా వినియోగదారులకు సేవలు అందిస్తూ ముందుకెళుతున్న శ్రీనువాస్‌గుప్తను వారు అభినందించారు. కార్యక్రమంలో అంబటి శ్రీనువాస్, సత్యనారాయణ, సత్యం, వినోద్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, సుదీర్, సుబ్బారావు, గౌరిశంకర్ గుప్త, సత్యంగుప్త, శ్రీనువాస్, నటరాజు, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

## సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ

**దుండిగల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంక్షేమసంఘాల ప్రతినిధులు గురువారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆయాకాలనీల్లో నెలకొన్న సమస్యలను సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సంక్షేమసంఘాలనాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**నిజాంపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త:** బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఓ ప్రకటనలో పేర్కోన్నారు. 11కెవి నిజాంపేట, ఎస్ఎల్‌జి, ఎస్ఎంఎస్, మహావిల్లాస్ ఫీడర్ల పరిదిలోని శ్రీనివాసలేక్‌వ్యూ, శిఖరవిల్లాస్, బాచుపల్లిసిగ్నల్ నుండి శిఖరవిల్లాస్ వరకు మెయిన్‌రోడ్, తహసీల్దార్ కార్యాలయం, నూతన పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 2గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహాకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## స్టైఫండ్ పెంచాలంటూ వైద్యవిద్యార్థుల సమ్మె

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఎర్రగడ్డలోని డాక్టర్ బిఆర్‌కెఆర్ ఆయుర్వేద మెడికల్ కళాశాలలో డాక్టర్లు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలంటూ సమ్మె నిర్వహించారు. 11రోజులుగా ఓపి సేవలను బంద్‌చేసి ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్నారు.వారికి మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గౌతమ్‌రావు, నియోజకవర్గం సినియర్ నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి, లంకల దీపక్‌రెడ్డి, కుంబాల గంగరాజు, కొలన్ సత్యనారయణ, ప్రేమ్‌కుమార్, కిలారి మనోహర్‌లు మద్దతు పలికారు. వైద్య విద్యార్థులకు స్టైఫండ్ 23వేలనుండి 40వేల వరకు పెంచాలని కోరారు.



విద్యార్థులకు మద్దతుపలుకుతున్న బిజెపి నాయకురాలు కీర్తిరెడ్డి

# సనత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సత్తాచూపుతాం

**టిపిసిసి సభ్యుడు మర్రి ఆదిత్యారెడ్డి**

**బేగంపేట ఆగస్టు 10, ప్రభాతవార్త :**

సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ సత్తా చూపుతామని టీపీసీసీ సభ్యుడు, ఎంసిఆర్ఎఫ్ ఛైర్మన్ మర్రి ఆదిత్యారెడ్డి అన్నారు. బేగంపేటలో ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు నియోజకవర్గపరిధిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసామన్నారు. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్దే ఇప్పటికీ కనిపిస్తుందని, తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై సూటిగా పలు ప్రశ్నలను సంధించారు. హైదరాబాద్‌కు జీవ నదిలాంటి మూసీ నదిని నాలాగా మార్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిన గచ్చిబౌలి, హైటెక్స్ వంటివాటిని తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఓవైపు ప్రభుత్వ పథకాల అమలులో ఘోరంగా వైఫల్యం చెందారని,విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. అలాగే మతాల పేరుతో హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ప్రజలు నమ్మ స్థితిలో లేరన్నారు.దేశాన్ని విచ్చిన్నం చేసేవైపు అడుగులు వేస్తున్న ఇలాంటి పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ ఇటీవల కురిసిన వర్షాలకు తన ఇంటి పైకప్పు దెబ్బతిన్నదని,ప్రభుత్వ సాయం అందలేదని, ఈ విషయాన్ని దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆదిత్యారెడ్డి వెంటనే ఆ మహిళ ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో, సనత్‌నగర్ మాజీ కార్పొరేటర్ ఆయూబ్‌ఖాన్ కాంగ్రెస్ నాయకులు నసీర్(అడ్డు), సలీం, మునీర్‌ఖాన్, పాషా, యాకూబ్, సిద్దిఖీ, రఘుయాదవ్, విఠల్, డాక్టర్ శివకుమార్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

## గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌లకు కొవ్వొత్తులతో నివాళులు

**సికింద్రాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** పీడిత ప్రజల గొంతుకలు గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ మృతి సమాజానికి తీరనిలోటని మహాజన సోషలిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్‌మాదిగ అన్నారు. ఎంఎస్‌పీ, ఎంమ్మార్‌పీఎస్ సికింద్రాబాద్ కో ఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో పార్సిగుట్ట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యాక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌లు తుదిశ్వాస వరకు పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తమ మాటాపాట ద్వారా పాలకులను నిలదీస్తూ అట్టడుగు వర్గాల ప్రయోజనాల కోసం ఉద్యమించారన్నారు. ఈ కార్యాక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నేత మంతిని సామ్యూల్ మాదిగ, నేతలు ఇనుముల నరసయ్య మాదిగ, తుమ్మల శివప్రసాద్ మాదిగ, పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గృహలక్ష్మి' దరఖాస్తు గడువును పొడిగించాలి



అడిషినల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న కార్పొరేటర్లు

**హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకాన్ని మరికొంత కాలం పొడిగించాలని సిఎం కెసిఆర్, జిహెచ్ఎంసి కమిషనర్‌కు హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్, మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు సిఎంకు ఒక లేఖ రాయడం జరిగింది. అలాగే జిహెచ్ఎంసి కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో అడిషినల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్లు మాట్లాడుతూ గృహలక్ష్మీ పథకానికి సంబంధించి పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఏ మున్సిపల్ కార్యాలయంలో అధికారులు తీసుకోవడం లేదని, కొన్ని మండల కార్యాలయాల్లో మాత్రమే తీసుకున్నారని ఆరోపించారు. అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తుల స్వీకరణకు మరింత కాలం పొడిగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, మహేష్, విక్రమ్, రోమిట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ**

## ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి : కార్పొరేటర్



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్

**ఫిల్మ్‌నగర్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ పోస్టాఫీస్ వద్ద జిహెచ్ఎంసి అధికారులు ఓటరు నమోదు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఓటు నమోదు కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా అడ్రస్ మార్చుకునేవారు కూడా తమ తమ వివరాలను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవహర్‌నగర్ కమిటీ హాల్, ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీ కమిటీ హాల్‌లో కూడా ఈ ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 14వ తేదీ వరకు ఈ ఓటరు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యూసెన్స్ చేస్తున్నారని ప్రశ్నిస్తే

## ఇంట్లోకి చొరబడి కారంపొడి చల్లి యువకుడిపై దాడి

**సెల్‌ఫోన్, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు**

**జవహర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** అర్ధరాత్రి రోడ్డుపై అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలిపి న్యూసెన్స్ ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించినందుకు ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో శివగల దేవదాస్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. అయితే కొద్ది రోజులుగా అదే కాలానికి చెందిన కొంతమంది యువకులు అర్ధరాత్రి వరకు రోడ్డుపై వాహనాలను అడ్డంగాపెట్టి న్యూసెన్స్ చేస్తుండడంతో బుధవారం రాత్రి దేవదాస్ వారిని ప్రశ్నించాడు. దీంతో వారిమధ్య వాగ్వాదం జరిగింది. ఉదయం మాట్లాడుకుందాం అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాగా గురువారం ఉదయం అజయ్‌తో పాటు మరి కొంతమంది యువకులు దేవదాస్ ఇంట్లోకి చొరబడి కారంపొడి చల్లుతూ దాడికిపాల్పడ్డారు. ఇంట్లోని సెల్‌ఫోన్, కొంత నగదును దుండగులు అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## డూప్లికేట్ వస్త్రాలను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**7 బండిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**మలక్‌పేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** బ్రాండెడ్ పేర్లను ఉపయోగించి డూప్లికేట్ వస్త్రాలను విక్రయిస్తున్న ఓ వ్యక్తి అరెస్టు చేసి వారి వద్ద నుండి 7 బండిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం దిల్‌సుక్‌నగర్‌లో ఎఫ్ఎఫ్‌టిఐ స్పోర్ట్స్ వేర్ షాప్‌లో లాకోస్టి, గ్యాంట్ బ్రాండ్లను ఉపయోగించి డూప్లికేట్ వస్త్రాలను విక్రయిస్తున్నారని సయ్యద్ మహ్మద్ ఫారుఖ్ మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీంతో పోలీసులు షాప్‌ను పరిశీలించి డూప్లికేట్ వస్త్రాలను స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్ చేసారు. షాప్ నిర్వాహకుడు శివను పోలీసులు అదుపులోకి తీసుకుని సుమారు 7 బండిళ్ల డూప్లికేట్ వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ జయంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

**ధర్నాచౌక్, ఆగస్టు 10, ప్రభాతవార్త:**

ప్రమాదవశాత్తూ మామిడి చెట్టుపై నుండి క్రిందకూ పడిపోయి వ్యక్తి మృతి చెందిన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లిలో నివసించే శ్రీరాం వంశీధర్ (48) ఫ్లవర్ డెకరేషన్, క్యాటరింగ్ పనులు చేస్తూ ఉండేవాడు. గురువారం ఉదయం మామిడి ఆకులు అవసరం అయ్యి స్నేహితుడు దుర్గాదాస్‌తో కలసి గాంధీనగర్‌లోని ఒక మామిడి చెట్టు దగ్గరకి వెళ్లారు. దుర్గాదాస్ క్రింద నుంచోగా, వంశీధర్ చెట్టు ఎక్కి ఆకులు కోస్తున్నాడు. ఈ క్రమంలో వంశీధర్ కాలు పెట్టిన కొమ్మ విరిగి ఒక్కసారిగా క్రిందకు పడిపోయాడు. వంశీధర్ తలకు బలమైన గాయం అవటంతో దుర్గాదాస్ అతని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వంశీధర్ సోదరుడు శ్రీరాంరాజు అతనిని గాంధీ హస్పటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేవలం ప్రమాదవశాత్తూ క్రింద పడిపోయాడని, తన సోదరుని మరణంపై ఎటువంటి సందేహాలు లేవని శ్రీరాంరాజు పోలీసులకు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు డబ్బాలు

## నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 10 ప్రభాతవార్త,**

నికోటిన్‌తో కూడిన నిషేధిత విదేశీ సిగరెట్లను కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... చాంద్రాయణగుట్ట బార్కస్ ప్రాంతానికి చెందిన ఓమర్ బిన్ ఇలియాస్ జుమ్మాలీ(34) బార్కస్‌తో జుంబాలీ జనరల్ స్టోర్‌ను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చాలిచాలని డబ్బుతో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం వేసుకొని హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన అజర్ వద్ద నుండి ఫారిన్ సిగరెట్‌లను కొనుగోలు చేసి గత కొన్ని రోజులుగా విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాంద్రాయణగుట్ట పోలీసులతో కలిసి జుంబాలీ జనరల్ స్టోర్‌పై దాడి చేసి అతని వద్ద నుండి 1లక్షా 10 వేలు విలువచేసే సిటరెట్ డబ్బాలను స్వాధీనం చేసుకొని చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ న్యూభరత్‌నగర్ కాలనీలో ఒక ఇంట్లో కొందరు పేకాట ఆడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున ఆనరు. ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన కె.సురేష్, షేక్ పాషా, తన్నీరు శేషారావు, బదిని విష్ణువర్ధన్, ఈగల సురేష్, తాడూరి అర్జున్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.22, 300 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రామంతాపూర్‌లో వ్యభిచార ముఠా గుట్టురట్టు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక ఇంటిపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ మధుసూధన్ కథనం ప్రకారం.. రామంతాపూర్ గోఖలేనగర్‌లోని ఒక ఇంట్లో కొద్ది రోజులుగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ మధుసూధన్ ఇంటిపై దాడిచేయగా ఇంట్లో ముచ్చెర్ల మండలం, ఓటపల్లికి చెందిన తేరేటి మహేందర్ 31తోపాటు, నిర్వాహకుడు కాళ్లకూరి కేశవ(29) పట్టుబడినట్లు తెలిపారు. వీరితోపాటు, అస్సాంకు చెందిన మనీషా(24), సబీనా(28) పట్టుబడినట్లు తెలిపారు. మసాజ్‌ముసుగులో వ్యభిచారం చేస్తుండగా వీరిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్‌లో యువకుడిపై దాడి, తీవ్ర గాయాలు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తులు ఒక యువకుడిపై కత్తితో గాయపర్చడంతో తీవ్ర గాయాలకు గురైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రధాన రహదారిలో ఈనెల 8వ తేదిన రాత్రి 10 గంటల సమయంలో రంజిత్ 28 అనే యువకుడు కిరాణాషాపు వద్ద నిలబడి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతనితో వాగ్వివాదానికి దిగినట్లు తెలిపారు. దీంతో వెంట తెచ్చుకున్న కత్తితో యువకుడిని గాయపరిచినట్లు తెలిపారు. తన సోదరితో చాటింగ్ చేస్తున్నావని గొడవ పెట్టుకున్నారని, బాధితుడు తన సెల్ ఫోన్‌లో చాటింగ్ చేయలేదని చెప్పి ఫోన్ ఇవ్వగా తీసుకుని పరారైనట్లు తెలిపారు. గాయపడిన రంజిత్‌ను స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

**నాంపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** జీఆర్పి హైదరాబాద్ (నాంపల్లి) రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలోని నేచర్‌క్యూర్ రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం–2 నుండి ఎంఎంటిఎస్ రైలుకిందపడి ఒక గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. జీఆర్పి హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం 9 బుధవారం రాత్రి 11.30గంటల సమయంలో నేచర్‌క్యూర్ రైల్వేస్టేషన్ కిలోమీటర్లు నంబరు 177/33, 178/01ల ఫ్లాట్‌ఫాం–2 వద్ద ఆన్‌లైన్‌లో ఎంఎంటిఎస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడగా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడివయస్సు 50–55 సంవత్సరాలు. ఎత్తు 5.6 అడుగులు, కోలముఖం, నల్లపుతెలుపుజుట్టు. ఛాతీమీద పుట్టుమచ్చ ఉంది. మృతుడు తెలుపు నలుపు పుల్‌షర్టు, తెల్లరంగు బనియన్, లేతనలుపురంగు ప్యాంటు, నీలంరంగు కట్‌డ్రాయర్ ధరించి ఉన్నారు. మృతుడి శవానికి పంచనామా అనంతరం ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, మృతుడి శవాన్ని ఆస్పత్రిలోని మార్చులో భద్రపరిచినట్లు, సంబంధీకులు పూర్తి వివరాలను హైదరాబాద్ (నాంపల్లి) జీఆర్పి రైల్వే పోలీసుస్టేషన్ ఫోన్ నంబరు 040–23202238 లేదా హెచ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు మొబైల్ నంబరు 9848349544లో సంప్రదించవచ్చునని తెలిపారు.

## గుర్తు తెలియని యువతి మృతి

**నాంపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** హైదరాబాద్ (నాంపల్లి) జీఆర్‌పి రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ బోరబండ రైల్వేస్టేషన్ల మధ్య ఒక గుర్తుతెలియని యువతి అపస్మారక స్థితిలో బుధవారం రాత్రి మృతిచెందాడు. జీఆర్పి హెచ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో రైల్వే పోలీసు కీమ్యాన్ రంగయ్య హైటెక్‌సిటీ బోరబండ రైల్వేస్టేషన్‌ల మధ్య కిలోమీటర్లు నంబరు 169/20–22 వద్ద అపస్మారక స్థితిలో ఉన్న మహిళను గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో అదే రోజు మధ్యాహ్నం 3.21గంటలకు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా 9 బుధవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి వయస్సు 38 సంవత్సరాలు. ఎత్తు 5.2 అడుగులు, గుండ్రనిముఖం, నల్లజుట్టు. పెదవికింద పుట్టుమచ్చ ఉంది. మృతురాలు ఫుల్‌హ్యాండ్స్ బుర్ఖా, మిలటరీ నైట్‌ప్యాంట్, మల్టీకలర్ టాప్, నల్లరంగు బాడీ, కుడిచేతికి ఆకుపచ్చరంగు గాజులు, ఎడమకాలుకు నల్లపూసలతాడు ధరించి ఉంది. శవానికి పంచనామా అనంతరం ఆస్పత్రిలోని మార్చులో భద్రపరిచినట్లు, సంబంధీకులు పూర్తి వివరాలను హైదరాబాద్ (నాంపల్లి) జీఆర్‌పి రైల్వే పోలీసుస్టేషన్ ఫోన్ నంబరు 040–23202238చ ఎస్ఐ మొబైల్ నబంరు 8712658580 లేదా హెచ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసు నంబరు 9848816334లో సంప్రదించవచ్చునని తెలిపారు.

# జీవితంలో ఒకరి సహకారం మరొకరికి కావాలి

### జస్టిస్ నాగమారుతి శర్మ


పురస్కారాలను ప్రదానం చేస్తున్న జస్టిస్ నాగమారుతి శర్మ

**చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** జీవితంలో విజయాల సాధనకు ఒకరికొకరు పరస్పర సహకారం అవసరమని సీబీఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. 'విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం' పేరుతో ఉత్తమ దంపతులకు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆరాధన కల్చరల్ అసోసియేషన్ అధినేత లోకం కృష్ణయ్య ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ నాగమారుతిశర్మ పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. గంగోత్రి నిలయం చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిల్లా రాజశేఖరరెడ్డి, వ్యాఖ్యానవాచస్పతి లంక లక్ష్మినారాయణ, డాక్టర్ రామరాజు, శ్రీనివాస్, ప్రవీణ్ పాఠక్, స్వప్న, పి.ఉమర్‌ఖాన్, తిరుమాణి చంద్రశేఖర్ హాజరయ్యారు. వై.కె.నాగేశ్వరరావు స్మారక పురస్కారాన్ని రసమయి సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాముకు, జవ్వాది రామారావు స్మారక పురస్కారాన్ని కె.వి.కృష్ణవర్మ (పాలకొల్లు), సంగీత పురస్కారాన్ని వీణారాగ చంద్రిక రామరాజు లక్ష్మీశ్రీనివాస్(గుంటూరు), సేవారంగ పురస్కారాన్ని కుసుమ భోగరాజుకు అందించి గౌరవించారు. 'విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం' పేరుతో నాటకరంగం నుంచి జవ్వాది దాశరథి–నాగశ్రీ, విద్యారంగం నుంచి రాజేష్–మహాలక్ష్మి, సేవారంగంనుంచి డాక్టర్ ఫరీద్‌బాబా–షేక్ హసీనా, మీడియా రంగం నుంచి నాగకిషోర్–సుభాషిణి, న్యాయరంగం నుంచి రగునందన్‌రావు–సుభాషిణి, రాజకీయ రంగం నుంచి వి.రామ్మోహనరావు–గీతా కుమారి, సిజేబుల్డ్ విభాగం నుంచి పోగుల శ్రీనివాసరావు–ఎ.కల్పన, పరిపాలన రంగం నుంచి ఎమ్మార్వోసుబ్బారెడ్డి–విజయలక్ష్మిలకు అందించారు. ఈ సందర్భంగా రామరాజు లక్ష్మీశ్రీనివాస్ వీణా వాదన, అనిశ్రితరెడ్డి నృత్య ప్రదర్శన అలరించింది.

## మణిపూర్ ఘటనలో బిజెపి ప్రభుత్వం విఫలం

కంటోన్మెంట్, ఆగస్టు 10 ప్రభాతవార్త: మణిపూర్‌లో వందల మంది అమాయకుల ప్రాణాలు పోతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అల్లర్లను కట్టుదిట్టం చేయడంలో ఘోరంగా విఫలమైయ్యారని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, అల్వాల్ మునిసిపల్ మాజీ చైర్మన్ జీవకన్ విమర్శించారు. గురువారం మదర్ థెరి స్సా విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ప్రధాని మోడి తలుసుకుంటే ఘటనలు కట్టుదిట్టమయ్యేవన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం సరైంది కాదన్నారు. హర్యానాలో కూడా మత కలహాలు చెలరేగడంతో అమాయకుల ఇండ్లను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.డి.నాగేశ్‌యాదవ్, ఆరోగ్యం, డి.బాబురావ్, జూడుపాల్, ఎల్.ఎం.రెడ్డి, శ్రీనాథ్,శ్రావణ్ ముదిరాజ్, మరియన్ పాల్గొన్నారు.

## తూకాల్లో మోసాలకు పాల్పడితే సహించేది లేదు

### బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హారిక ఆనంద్

**కంటోన్మెంట్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** కూరగాయల వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా వాహన చోదకులు, షాప్‌ల యజమానులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ హారిక ఆనంద్ బాబు సూచించారు. గురువారం బోయిన్‌పల్లి మార్కెట్‌లోని వివిధ షాప్‌లను తనిఖీ చేశారు. ఒక్కొక్క షాప్‌కు ఒకే త్రాస్ ఉండాలని సూచించారు. బినామీ పేర్లతో షాప్‌లను నిర్వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతల వేణుగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు బత్తుల నారాయణ, దేవులపల్లి శ్రీను, మీనా భాస్కర్, జవహర్, భాస్కర్, రామక్రిష్ణ, ప్రభాకర్, అధికారులు సత్య నారాయణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ల నిర్మాణానికి రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్

**కంటోన్మెంట్,ఆగస్టు 10 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల్లోని రెండు ప్రధాన జాతీయ రహదారుల ఫ్లైఓవర్ల నిర్మాణానికి రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణలు తెలిపారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి సుచిత్ర, మేడ్చల్, జూబ్లీ బస్టేషన్, బొల్లారం మీదుగా శామీర్‌పేట్ వైపు వెళ్లే జాతీయ రహదారుల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, స్కైవేలు నిర్మించేందుకుగాను రక్షణ శాఖకు చెందిన 33 ఎకరాల రక్షణ శాఖ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో తీర్మాణం చేసి 33 ఎకరాల డిఫెన్స్ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసేందుకు ఆమోదం తెలిపింది.

## కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలి : పిడమర్తి రవి

**కంటోన్మెంట్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పని చేయాలని ఆ పార్టీ నాయకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. గురువారం రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటికాయల యేసు రత్నం, సంజీవ్, ఆనందం, జాషువ, ఇబ్రహీం, ఎం.డి.పాషా తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌పై క్రిమినల్ కోర్టు

## బార్ అసోసియేషన్‌తో సమావేశం

**నాంపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు భవనంలోని మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ లోక్‌అదాలత్‌పై నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్‌తో సంస్థ చైర్మన్, సెషన్స్‌జడ్జి ప్రేమవతి, 1వ అదనపు సెషన్స్‌జడ్జి రమాకాంత్, సీనియర్ సివిల్‌జడ్జి,కార్యదర్శి రాధిక జైశ్వాల్‌లు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబరు 9 శనివారం జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికసంఖ్యలో కేసులు పూర్తయ్యేలా ప్రతీఒక్క న్యాయవాది చర్యలు తీసుకొని వారి పార్టీలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి లోక్‌అదాలత్ విజయవంతం అయ్యేలా కృషిచేయాలని కోరారు. ముఖ్యంగా ఎన్ఐ యాక్టు కేసులు, రాజీ చేసుకోదగిన కేసుల వివరాలను తెలుసుకొని లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని, ఇందుకుగాను కక్షిదారులకు లోక్‌అదాలత్‌లో రాజీ అవ్వడం వల్ల సమయం, వ్యవప్రయాసలు తగ్గడంతోపాటు కలిగే ప్రయోజనాలను వివరంగా తెలపాలని న్యాయవాదులను వారు కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు జాతీయ లోక్‌అదాలత్ తప్పక విజయవంతం చేయడానికి కృషిచేస్తామని తెలియజేశారు.

## మోండా కాలనీల అభివృద్ధికి కృషి : కొంతం దీపిక

కంటోన్మెంట్,ఆగస్టు 10 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. గురువారం ఈస్ట్,వెస్ట్ మారేడ్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మారేడ్‌పల్లి న్యూ క్లబ్ కోశాధికారి మధుసూదన్, బిజెపి నేత కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, భూపతిరాజు, శిరీష, రవిగుప్త

## అక్టోబర్ 1న సరూర్‌నగర్ స్టేడియంలో "వైశ్య గర్జన "

**హైదరాబాద్, ఆగస్టు 10,ప్రభాతవార్త:** వైశ్యుల ఆత్మగౌరవం ..హక్కుల సాధన లక్ష్యంగా అక్టోబర్ 1న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో "వైశ్య గర్జన "నిర్వహించన్నున్నట్లు వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమవేశంలో వైశ్యగర్జన పోస్టర్‌ను పలువురు వేదిక ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈసంరద్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైశ్యకార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జనాభా దామాషా ప్రకారం రాజకీయాల్లో వాటా కల్పించాలన్నారు. అలాగే వైశ్యుల రక్షణకు వైశ్య కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా విదేశీ విద్య సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. అలాగే రాష్ట్రంలోని పేద వైశ్యులకు వైశ్యబంధు ప్రకటించి వారిని ప్రోత్సహించాలన్నారు. అంతేకాకుండా సమగ్ర కుటుంబసర్వే నివేదికలోని అగ్ర వర్ణాల వివరాలు, జనసంఖ్య, గణాంకాలు ప్రకటించాలన్న ప్రధాన ఉద్దేశంతో ఈసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భూపతిరాజు గుప్త, న్యాయవాది శిరీష, కొత్తరవి గుప్త, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడిలో నీటి సమస్యను పరిష్కరించాం : రామకృష్ణారెడ్డి

**నార్సింగి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** మణికొండ ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించామని మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో నీటి ట్యాంక్‌ను, సంప్‌లో నుంచి నీటిని లాగేందుకు మోటార్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేదల బిడ్డలే చదువుకుంటున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించడం మన బాధ్యతగా భావించి ఈ మంచిపని చేయడం జరిగిందన్నారు. గత కొన్ని రోజులుగా పాఠశాలలో నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించామన్నారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు దాతల నుంచి ఇప్పించామన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. ఏటేటా మణికొండ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంగ్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ప్రగతియాత్రంలో భాగంగా గురువారం సూరారం డివిజన్ పరిధిలోని విశ్వకర్మకాలనీలో ఎమ్మెల్యే వివేకానంద్ పర్యటించారు. పాదయాత్ర చేసి ఆయా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రూ,48లక్షల నిధులతో చేపట్టిన సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులకు కొరత లేకుండా నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అంతకుముందు కాలనీలో రూ,3కోట్ల88 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యేకు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నేరాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, కార్యదర్శి సిద్ధికి,నాయకులు మన్నే బాలేష్, ఇంద్రసేనాగుప్తా, కాలనీప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, యాదిరెడ్డి, నర్సింహా, రాములు, వాసు, గిరి, వివిధ విభాగాల అధికారులు, పాల్గొన్నారు.

## భూఆక్రమణలు అరికట్టాలి

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 10, ప్రభాతవార్త :** ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ సర్వే నెంబర్ 57లో జరుగుతున్న భూ కబ్జాలపై ఆల్విన్‌కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎమ్మార్వో ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 57లో జరుగుతున్న భూకబ్జాలను స్థానిక అధికారుల సహకారంతో స్థానిక నాయకులు కబ్జాలు చేస్తున్నారని, ఈ సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడ ఉందో తెలిసే విధంగా బోర్డులు పెట్టి ఆ భూమిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్లూరి రామరాజు బీజెవైఎం సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, జాతీయ కో ఆర్డినేటర్ కుమార యాదవ్, మాజీ కార్యదర్శి కేశవరావు, రాంరెడ్డి, రాజు, రామచంద్రుడు, సతీష , బాబురావు, అమర్‌నాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కళాశాలలో ఆర్థికశాస్త్రంపై సదస్సు

చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త: **ఆర్థికశాస్త్రం పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు** ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ విద్యావేత్త, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ రత్న అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో ఎం.ఎ.ఎకనామిక్స్ విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాలలో ఘనంగా సత్కరించి అభినందించే కార్యక్రమం జరిగింది. ఎం.ఎ.ఎకనామిక్స్ పూర్తి చేసుకున్న వారికి ఉజ్వల భవిత ఉంటుందని, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో ఆర్థికశాస్త్రం పాత్ర గణనీయమైందన్నారు. అర్థశాస్త్రంలో ప్రముఖులను ప్రిన్సిపాల్స్ స్మరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.భవానీ మాట్లాడుతూ ఆర్థిక శాస్త్ర ప్రాముఖ్యతను చక్కటి ఉదాహరణలతో వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కళాశాల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు, లా కళాశాల ప్రిన్సిపాల్ డాకస్టర్ సుజన, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ విట్టలాచారి, ప్రిన్సిపాల్ విజేందర్, ఎకనామిక్స్ హెచ్ఓడి వెంకటరమణ, ఫాకల్టీ డాక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు, బధిరుల సమస్యలను పరిష్కరించాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు, బధిరుల సమస్యలను వెంటనే చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతి, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేశ్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందులో భాగంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం జరిగిందని, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడానికి రాష్ట్ర స్థాయిలో ఉన్న వివిధ సంఘాలతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని 12న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా 21న ఛలో సెక్రెటేరియట్ పేరుతో మహాధర్నాను చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో దివ్యాంగులు ఈ సమావేశానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు దివ్యాంగుల బంధ్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, నిరుద్యోగ దివ్యాంగులకు, నిరుద్యోగ భృతి కింద రూ.4వేల ఇవ్వాలని, స్వయం ఉపాధి కోసం రూ.5లక్షల ఆర్థిక సహాయం చేయాలని, 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, అన్ని శాఖలలో 4శాతం రిజర్వేషన్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దివ్యాంగులకు సంబంధించిన సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి ఆయా సమస్యలను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎంతో ప్రాధాన్యత ఈ సమావేశానికి ఉందని వివరించారు.

## ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదుచేసుకోవాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు నూతనంగా ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని పేర్లు నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్ ఈసేవా కేంద్రం వద్ద ఓటరు నమోదు కార్యక్రమాన్ని వి.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎన్‌రోల్‌మెంట్ సూపరవైజర్ అమరసింహారెడ్డి, బిఎల్ఓ నరేశ్, ఆర్‌డబ్ల్యుఏ బృందం సభ్యులతో పాటు బిఆర్ఎస్ నేతలు నేతా శ్రీనివాస్, మాధవరావు, స్వర్ణలత, చిట్టి శ్యామ్‌సుందర్, రేషం మల్లేష్, బుజ్జి వెంకటేశ్వరరావు, సిరిగిరి శ్యామ్, అస్లామ్ భాయ్, ప్రవీణ్, ప్రేమలతారెడ్డి, టక్కర్ శ్రీను, రింకు సింగ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఓటు నమోదు చేసుకుంటున్న ప్రతి ఒక్కరికీ తగిన విధంగా సహకరిస్తూ, పేరు, చిరునామా సరి చేసుకోవడంతో పాటు నూతనంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్రెస్ ప్రూఫ్, ఫోటోలు, ఆధార్‌కార్డుతో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు.

### విద్యారంగ అభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న పోరాటం

## అభినందనీయం : సాహితీవేత్త మోతుకూరి నరహరి

**ధర్నాచౌక్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** విద్యారంగ అభివృద్ధికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నలభై ఏళ్లు, తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాలుగా యూటీఎఫ్ చేస్తున్న పోరాటం అభినందనీయమని ప్రముఖ సాహితీవేత్త మోతుకూరి నరహరి కొనియాడారు. గురువారం దోమలగూడలోని టీఎస యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ 50వ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆయన ఆవిష్కరించిన అనంతరం టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కే.జంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న సౌకర్యాలన్నీ సంఘాల ఐక్యపోరాటాల ఫలితంగా వచ్చినవేనని అన్నారు. నేటి పాలకులు వాటిని ఒక్కొక్కటిగా హరించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సంయుక్త, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావరవి, సీనియర్ నాయకులు పి.మాణిక్‌రెడ్డి, కొండలరావు, మస్తాన్‌రావు, నరసింహాచారి, వందన, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు

**నార్సింగి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** గండిపేట మండల నూతన తహసీల్దార్ గోవర్ధన్‌ను గురువారం బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. షాలువా, పూల దండతో సన్మానించారు. అనంతరం కోకాపేట కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి, గోపాల గణేష్‌లు మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ, ఆసరా పించన్లకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికి త్వరగా డబ్బులు వచ్చేలా చూడాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. భావి తరాల అవసరాల కోసం ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, కబ్జాలపై ఉక్కుపాదం మోపాలని తెలిపామన్నారు. విద్యార్థులకు కులం, ఆదాయం, స్థానిక ధృవపత్రాలు వేగంగా అందేలా చూడాలని కోరామని వివరించారు. తహసీల్దార్‌ను సన్మానించిన వారిలో కౌన్సిలర్ పత్తి ప్రవీణ్, నాయకులు మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
సంక్షిప్త టెండర్ ఇ–ప్రొక్యూర్‌మెంట్ నిట్ సం.17/EE/DIV-15/SBZ/GHMC/2023-24, తేది: 10.08.2023, నిట్ నం.: పైన పేర్కొన్నది. పని పేరు: 9 నం. సివిల్ పనులు. అంచనా మొత్తం: రూ.150.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 14.08.2023 మ.3.00 గం. వద్ద. డౌన్‌లోడ్ ముగింపు తేది: 18.08.2023 మ.3.00 గం. వద్ద. బిడ్ తెరుచుట: 18.08.2023 మ.3.15 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, కార్యాలయం, సెల్ నం: EE–డివిజన్–15, GHMC, 9704456422.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.15, GHMC
DIPR.No.5269-PP/CL/Advt/1/2023-24, తేది: 10.08.2023

# హోంగార్డుల రిటైర్‌మెంట్ వయోపరిమితి పెంచాలి

### తెలంగాణ హోంగార్డ్స్ కమాండెంట్‌ను కలిసిన హోంగార్డ్స్ జేఏసీ


తెలంగాణ హోంగార్డ్స్ కమాండెంట్ రామశేషమూర్తికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నేతలు

హైదరాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న హోంగార్డుల రిటైర్మెంట్ వయోపరిమితిని 65 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ తెలంగాణ హోంగార్డ్స్ కమాండెంట్ ఐ.రామశేషమూర్తిని ఆల్ ఇండియా హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర పూర్వ చైర్మన్, జేఏసీ చైర్మన్ సకినాల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి పి.రాజశేఖర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సకినాల నారాయణ మాట్లాడుతూ గతంలో సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆ దిశలో చర్యలు తీసుకోవాలని, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అన్యాయంగా విధుల నుంచి తొలగించిన వారికి కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకున్నవారికి ఎలాంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకోవాలని, రిటైర్‌మెంట్ అయిన వారికి డబెల్‌బెడ్ రూమ్ ఇళ్లను ఇవ్వాలని, 'గుడ్‌సర్వీస్' కింద రూ.10లక్షల రివార్డు ఇస్తూ రిటైర్‌మెంట్ చేయాలని, రిటైర్‌మెంట్ వయోపరిమితి 65 సంవత్సరాలకు పెంచాలనని, మా న్యాయమైన సమస్యల విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని, కాని రాష్ట్రంలోని హోంగార్డుల కుటుంబాలు రోడెక్కే పరిస్థితిని కొంత మంది నాయకులు, అధికారులు కుట్రలు చేస్తున్నారని, సిఎం కెసిఆర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. 14వేల మంది హోంగార్డులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

This is to inform that my client **NEETHA THAKUR W/o. Ajay Singh,** R/o. 15-1-418, Feelkhana, Begum Bazar, Hyderabad, T.S., while shifting our residence from Begum Bazar to Feelkhana, I lost my **Original Passport bearing No. G 1159899 issued on 22-12-2016** along with other documents.
A police complaint has been lodged in P.S. Begum Bazar. If any one found the said registered Deed, please return the same. Contact Details.

**RAJESH TIWARI**
**Advocate**
H.No.23-3-497,
Sultan Shahi,
Hyderabad, T.S.
**Cell # 98667 55550**

**PUBLIC NOTICE**

General Public are hereby informed that our client **Smt. Padmaja Ayyagari** D/o. Late Sri. Adury Suryanarayana W/o. Sri. Manikyala Rao Ayyagari, Aged about 56 years, Hindu, Female, Occ. House Wife, R/o Flat No. 402, Siri Anjana Enclave, Pragathi nagar, NMC, Bachupally Mandal, Hyderabad- 500090 had lost their Original Sale Deed/ Title Deed Nos.12641/1984 dated 1st December-1984 of SRO of Hayathnagar (erstwhile Hyderabad East) pertaining totheir property/ Open Plot No.148, Survey 579 & 592, admeasuring 300 Sq.Yards or 250.83 Sq.Mtrs. situated at Peda Amberpet Village Hayathnagar Taluk, Ranga Reddy Dist. under Peda Amberpet Gram Panchayaty and within the Registration Jurisdiction of Sub-Registrar Hyderabad East bounded by: North: Plot No.135, South: 30 feet Road, East: Plot No.149, West: Plot No.147.
on 05-08-2023 while going from Pragathinagar on a two wheeler. My client also had lodged a Police complaint with the PS Bachupally about the same.
If someone come across/finds the above Original Sale Deeds/Title Deeds they are requested to contact the undersigned within 14 (fourteen) days from the date of this publication and handover the same to the undersigned or to the Police Station Bachupally failing which my client will presume that the above original Sale Deeds / Title Deeds cannot be tracedout.
Date: 10th August - 2023

**P. VENKAT RAMANA**
**DAYANAND PATIL**
**ADVOCATES**
Officeat- Plot No. 820, Ground Floor, Pragathinagar, NMC Hyderabad-500090.
**Mobile: 99482 70260.**

**IN THE COURT OF HON'BLE V SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD**
**I.A.NO.282 OF 2022**
**IN**
**O.S.NO.916 OF 2016**
BETWEEN:
**A.P.S.R.T.C.** Rep by its M.D., Mushirabad, RTC X Roads, Hyderabad.
**...Plaintiff/Petitioner**
AND
**S. Srinivasa Rao. and Others.**
**....Defendents/Respondent**
To,
**1. S. Srinivasa Rao,** S/o. Bhogeshwar Rao, A/a: 514 years, Occ: Business, R/o. H.No.5-84, Kanakamamidi Village, Moinabad Mandal, Ranga Reddy. **...D1**
Please take Notice that the above named Petitioner filed above O S against you and another. The Hon'ble Court posted the above case on **21/8/2023. at 10.30 am** for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
**M/s. M. GOVERDHAN RAO**
**Advocate**
Office :106, B-Block, Prajay Alkapuri Apts, Green Hills Colony, Opp: DPS. R.K puram, Hyderabad.

**IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL SENIOR CIVIL JUDGE CUM ADDL SMALL CAUSES COURT, CITY CIVIL COURT, AT HYDERABAD**
**I.A. No. 32 of 2023**
**In**
**I.P. No. 60 of 2003.**
**Between:**
Lalithamma, died per L.Rs., And others.
**...Petitioner/Respondent No.61.**
**And**
Y.Nagavalli.
**...Respondent / Petitioner.**
To,
Smt. Y.Nagavalli W/o. Sambashiva Rao, Aged 60 years, Occ: House wife, R/o. Flat No. 401, Srinidhi Residency, Street No.1, Tarnaka, Hyderabad.
**NOTICE**
The petitioners, who are the legal representatives have filed the above I.A. No. 32 of 2023, in the above I.P. No. 60 of 2003, on the file of the Hon'ble VI Additional Senior Civil Judge cum Additional Judge, City Small causes Court, at City Civil Court, Hyderabad, to declare them as L.Rs., of the deceased Lalithamma, the original Respondent No. 61 in the I.P. Therefore, please take notice that said I.A. No. 32 of 2023 is posted to 31-08-2023 at 10-30 A.M., before the said court and you are required to represent the said case, on the said date, at the said time, either in person or through your counsel, failing which the matter will be decided by the Hon'ble Court, basing on the available record and on merits.
**// BY ODER OF THE COURT //**
**D.JAWAHARLAL,**
ADVOCATE.
R/o. H.No. 10-1-98/10, Road No.2, Bhagyanagar Colony, Lingojiguda, Karmanghat, Hyderabad 500 035.
**Phone : 9391017101**

# రోడ్లపై పారుతున్న మురుగునీరు

## వ్యాధులు ప్రబలి కాలనీవాసుల అవస్థలు పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక కాలనీవాసులు



జైపురి కాలనీలో మురుగునీరు పారుతున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** మురుగు నీరు కాలనీలో పొంగిపొరుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. మురుగునీరు వాడుతుండడంతో స్థానిక కాలనీ ప్రజలు అనారోగ్యం పాలై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానిక కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీలలో చాలా రోజులుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతోందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరూ పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం జలమండలి, జిహెచ్ఎంసి అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని, కాలనీలో గత 25 సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ పైపులు చిన్నగా ఉండడంవల్లసమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని కాలనీవాసులు అంటున్నారు. నివాసాలు, జనాభా పెరుగుతుండడంతో పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారిందని, దానికి తోడు పందికొక్కుల బాధ వెంటాడుతోందాని కాలనీవాసులు తెలిపారు. మురుగునీరు రోడ్లపైకి రావడంతో దుర్వాసనతో చాలా ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యామల యాదగిరి వంశరాజ్ తెలిపారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోవట్లేదని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కమిషనర్‌కి రాతపూర్వకంగా ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేసిన ఒక్కరు కూడా ఇటువైపు తిరిగి చూడలేదని అధికారులకు ఏరుపాట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని అధికారులు ప్రజాప్రతినిధులు కాలనీలోని మురుగునీరు సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉప్పల్ ప్రధాన రహదారికి మరమ్మత్తులు : బేతి

వార్త ప్రభావం

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రధాన రహదారి రోడ్డు మరమ్మతు పనులను బుధవారం సాయంత్రం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఉప్పల్ రింగ్ రోడ్‌నుంచి నారపల్లివరకు వరంగల్ జాతీయ రహదారి వెంట రోడ్డు గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఇదే క్రమంలో దీనిపై పలుమార్లు వార్త దినపత్రికలో కథనాలు రావడంతో పార్టీ నేతలు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చారు. బుధవారం ప్రధాన రహదారి బిటిరోడ్డు పనులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జాతీయరహదారి వెంట నిత్యం అనేకమంది వాహనదారులు ప్రయాణిస్తున్నారని, దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన తెలిపారు. రోడ్డుకు మరమ్మతులు చేసి బిటి వేయిస్తామని తెలిపారు. కేవలం రూ.కోటి 69లక్షలతో ఉప్పల్ ప్రధాన రహదారి ఏ విధంగా తీర్చిదిద్దుతారో వేచి చూడాల్సిందే. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ అశోక్, ఆర్అండ్‌బి ఎఇ గోపీకృష్ణ, గాయత్రి మేనేజర్ అశోక్, పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైపు యువత : చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో యువత కాంగ్రెస్ వైపు చూస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేషన్ బిజెపి ఉపాధ్యక్షుడు ఓర్సు స్వామి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ వెంకటేశ్, మాజీ వార్డు మెంబర్ కౌసల్యతో పాటు పలువురు బిజెపిని వీడి పారిజాతతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు క కొత్త మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం పారిజాత మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ కుమ్ముక్కు రాజకీయాలకు విసిగిన యువ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, అఫ్జల్, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, మనోహర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఉపకమిషనర్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ అరుణకుమారిని గురువారం కలిసి కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనగర్, జనప్రియఅపార్ట్మెంట్ ఎదురుగా చెత్తడంపింగ్ పాయింట్ వుండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే డంపింగ్ పాయింట్ అక్కడి నుంచి తొలగించాలని కోరారు. అదేవిధంగా డివిజన్‌లోని సమస్యలపైన దృష్టి పెట్టాలని కోరారు.

## బిజెపితోనే అభివృద్ధి : రాంకోటేశ్వరరావు



రాంకోటేశ్వరరావు, రాజు సమక్షంలో బిజెపిలో చేరుతున్న శ్రీకాంత్‌గౌడ్

**మలక్‌పేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేమూరి రాంకోటేశ్వరరావు, ఓల్డ్ మలక్‌పేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఎన్. శ్రీకాంత్‌గౌడ్ బిజెపిలో చేరగా వారు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. గ్రేటర్‌లో బిజెపిని మరింత బలోపేతం చేసుందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి రాజేష్‌గుప్త, నాయకులు చౌకి రాజు, సత్యనారాయణ, రేవంత్, రమేష్, రాజ్‌కుమార్, మన్మోహన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ బేటి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో బేటి అయిన ఎన్వీఎస్ఎస్ తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో గురువారం మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ బేటి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్థిక స్థితిగతులపై ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు అర్థిక విధానాలు, ఆదాయ వనరులు పెంచుకోవడంకోరకు మద్యం అమ్మకాలు, భూముల అమ్మకాలపై రాష్ట్ర సర్కార్ దృష్టి కేంద్రీకరించిందని కేంద్ర మంత్రికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా కేంద్ర అర్థిక సంఘం ద్వారా అందిస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, పంచాయితీల జీతభత్యం, విద్యుత్ బిల్లులకోసం అందిస్తున్న నిధులు దారి మళ్లుతున్నాయని వివరించారు. ఎంఆర్‌బిఎం పెంచుకుంటూ పోతే మరింత దివాళ కోరు పరిస్థితి దాపురించే అవకాశముందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు, ఉద్యోగులు, విద్యార్థులకు రాష్ట్ర అర్థిక పరిస్థితి అర్థమైందని, తెలంగాణలో స్థిరాస్థులు తగ్గిపోతున్నాయని, దీనిపై సమీక్ష నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జి.మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లెవెల్స్ సరిచూసుకుని సీసీరోడ్లను ఏర్పాటు చేయాలి : కళ్లెం నవజీవన్‌రెడ్డి



అధికారులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** కాలనీలోని ఇళ్లను దృష్టిలో ఉంచుకుని లెవల్స్‌ను సరిచూసుకుని సీసీరోడ్లను వేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని మైత్రి అనుబంద్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని ఇళ్లన్నీ ఒకేసారి నిర్మించకపోవడంతో కొన్ని ఎక్కువ మరికొన్ని తక్కువ ఎత్తులో ఉన్నాయని వాటిని పరిగణలోకి తీసుకుని సీసీరోడ్లను ఏర్పాటు చేయాలని, నిర్మాణం పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ దామోదర్, ఏఈ నరేంద్రతేజ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పూసలబస్తీలో సిసి రోడ్డు పనులు ప్రారంభం : కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పూసలబస్తీ నుండి క్రాంతినగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డుకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, స్థానికులు జగన్నాథ్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో అన్న ప్రసాద వితరణ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోనే శ్రీ షిర్డీసాయి దేవాలయంలో గురువారం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ బొగ్గారావుదయానంద్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై మహేష్‌యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. అదేవిధంగా కాలనీలోని పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆకెళ్ళ రాఘవేంద్ర, సాయిబాబా టెంపుల్ చైర్మన్ శ్రీనివాస్‌నాయుడు, ప్రవీణ్, నరసింహారెడ్డి, నర్సి రెడ్డి, యాదగిరిముదిరాజు, జయశ్రీ, విజయభాస్కర్, టిఎంవై యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## పేదల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం



తహసిల్దార్ కార్యాలయంముందు ఆందోళన చేస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సిఎం కేసీఆర్ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతున్నారని సమాచారం తెలుసుకున్న భాస్కర్‌రెడ్డి గురువారం సరూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయం ముందు దరఖాస్తుదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికి సకాలములో తొలివిడతలోనే పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మున్సిపాల్టీ కార్యాలయానికి వెళ్ళమని అధికారులు సైతం పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయని ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టడానికి దళితబందు, బీసీ బందు, గృహలక్ష్మి పథకాల పేరిట కెసిఆర్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లెంకి ధనరాజ్‌గౌడ్, ఇమ్రాన్‌అలీ, తాండ్ర భాస్కర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత : దర్పల్లి

**మలక్‌పేట, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ వేమూరి రాంకోటేశ్వరరావు దర్పల్లిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, చౌకి రాజు, చెగిరెడ్డి మదన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర



గణేష్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్, పిఎస్‌కాలనీ, గోఖలేనగర్, మధురానగర్, శ్రీనివాసపురం, కామాక్షిపురం, నవరంగ్‌గూడ తదితర ప్రాంతాల్లో గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బేతి స్వప్న పాదయాత్ర నిర్వహించారు. హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు డా.బి.వి.చారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణేష్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధునీకరించాలని, పారిశుధ్య నిర్వహణ, రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవించారు. శ్రీనివాసపురంలో చెట్టు కొమ్మలు తొలగించాలని, విద్యుత్ దీపాలు వేయించాలని కోరా. అనంతరం స్థానికంగా ఉన్న పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం వెంకట్‌రెడ్డినగర్‌లో రూ.33 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, గుడి మధుసూధన్‌రెడ్డి, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కె.సోమిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గిరిబాబు, ముత్యంరెడ్డి, వనంపల్లి గోపాల్‌రెడ్డి, శివ, శ్రీధర్, అక్బర్, లింగానాయక్, అబ్బుబాయ్, యాదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తీజ్‌ను అధికారిక పండుగగా ప్రకటించాలి: ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రాంరెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీలో నిర్వహించిన తీజ్ పండుగకు ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకునే తీజ్ పండుగను ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులపై వివక్ష చూపుతుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్, రమేష్ నాయక్, శ్రీపాల్‌రెడ్డి, నర్సింహాయాదవ్, వేణుయాదవ్, మంజులరెడ్డి, దీప్లనాయక్ పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ సాయికుమార్‌రెడ్డి తెలిపారు. నవభారత్ ఫీడర్ పరిధిలోని ఐడిఏ, ఉప్పల్ మాడ్రన్ బేకరి తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి: చందర్‌రావు

**సరూర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలంగాణ ప్రైవేటు ఉద్యోగసంఘం రాష్ట్ర కార్యదర్శి బి.చందర్‌రావు అన్నారు. తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చందర్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు జారీ చేసిన ఉత్తర్వులను గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

## యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షునిగా అనిల్ యాదవ్

**సరూర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** అఖిలభారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షునిగా మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ నియమితులయ్యారు. కార్పొరేటర్‌గా ఉన్న ఆయనను ఉపాధ్యక్షునిగా రంగారెడ్డి జిల్లా యాదవ మహాసభ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బర్ల శ్రవణ్‌కుమార్ నియమించారు. ఈ మేరకు సమావేశంలోనే యాదవసంఘం నాయకులు అంజయ్యయాదవ్, మల్లేష్‌యాదవ్, రఘునాథ్ యాదవ్, కృష్ణ యాదవ్ తదితరుల సమక్షంలో ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాదవుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

## స్లాబ్ నిర్మాణ పనుల పరిశీలన : ప్రేమ్‌కుమార్



నాలాపై స్లాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పీవీఎన్ కాలనీలో సెయింట్ ఆన్స్ స్కూల్ దగ్గర నాలా స్లాబ్ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఈ నెల12న కామ్రేడ్ గద్దర్ సంస్మరణ సభ

**తుర్కయంజాల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఈ నెల 12న జరిగే కామ్రేడ్ గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి హయత్‌నగర్ మండల జేఏసీ మాజీ కన్వీనర్ కొంతం యాదిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 12న రొక్కం సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో పూర్వ హయత్‌నగర్ మండల టి.జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరి హాజరవుతున్నట్లు తెలిపారు. గద్దర్ అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా, యువజన సంఘాల కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కందాల బలదేవరెడ్డి, జెనిగె విష్ణువర్ధన్, టీఎన్ దాసుగౌడ్, డి.కిషన్, తూళ్ల నరసింహగౌడ్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన : శ్వేత



ఓటరు నమోదును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లోని సరస్వతినగర్, కృష్ణానగర్‌లలో ఏర్పాటుచేసిన ఓటరునమోదుకేంద్రాలను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన ఓటర్ల నమోదుతోపాటు పేర్లు, చిరునామాలో ఏమైనా తప్పులుంటే మార్పులు చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్ నియోజకవర్గంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో సమస్యలకు శాశ్వతపరిష్కారం లభించే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ భారత్‌నగర్‌కాలనీ డ్రైనేజీ సమస్యల పరిష్కారంకోసం గురువారం ఎమ్మెల్యే కాలనీవాసులు, జలమండలి అధికారులతో కలిసి తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి కాలనీవాసుల సమస్యల గురించి తెలుసుకున్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో ఎత్తుపల్లాలు చూడకుండా పనులు చేయడంవల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రస్తుతం చేపట్టే డ్రైనేజీ పనులు ఎత్తుపల్లాలు చూసుకొని ప్రణాళికబద్ధంగా, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనులు సకాలంలో పూర్తయితే సమస్యలనుంచి కాలనీవాసులకు విముక్తి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ బలరాంరాజు, కొత్తపేట డివిజన్ బారాస పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మహేష్‌రెడ్డి, బాలాజీ, మల్లేష్, నర్సింహా, రుక్కమ్మ, షరీఫ్, వెంకటేష్, జోగు కృష్ణ, మెయిన్ తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి సరఫరా అరికట్టేందుకు చర్యలు : కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి



చర్చికాలనీలో కలుషిత నీటి సరఫరాను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ చర్చికాలనీలో కలుషిత నీటి సరఫరా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, జలమండలి మేనేజర్ ఆసిఫ్‌అలీ, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి పలు కాలనీలో పర్యటించారు. కలుషిత నీటి జలాలను గుర్తించేందుకు ప్రత్యేక మిషన్ తెప్పించి పరీక్షలు చేయించినట్లు తెలిపారు. కొత్తగా తెచ్చిన మిషన్ ద్వారా కలుషిత నీటిని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం చర్చికాలనీ అంగన్‌వాడి కేంద్రం పుష్పలత ఇంటి సమీపంలో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చర్చికాలనీ అధ్యక్షుడు పి.సుధాకర్, జ్ఞాన్‌పాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లరెడ్డి, వినోద్, బాస్కర్, అలెగ్జాండర్, భాస్కర్, సమియాల్, రాయన్న, డేవిడ్, సుమలత, మేరి, ఉపేందర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి : కొలను శంకర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమాల్లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని మహేశ్వరం నియోజకవర్గ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఇంఛార్జి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా జరిగే కార్యక్రమాలను ఆయన వివరించారు. అమర వీరుల త్యాగాలకు గుర్తుగా శిలాఫలకాలను ఏర్పాటు చేయడం, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, మట్టికి నమస్కరించి సేకరించిన మట్టిని కలశంలో ఊరేగింపు, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పెండ్యాల నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, కార్పొరేటర్ భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐవిఎఫ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ పంపిణీ

**ఎల్.బి.నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** నాగోల్‌డివిజన్ జైపూర్‌కాలనీకి చెందిన పేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన తాడిశెట్టి శ్రీవాణికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవిఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో గురువారం కుట్టు మిషన్ అందజేసినట్లు ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. శ్రీవాణి ఆర్థికపరిస్థితి తెలుసుకొని వారి ఉపాధి కోసం కుట్టు మిషన్ అందజేసినట్లు పేర్కొన్నారు. నిరుపేద వైశ్యులకు అండగా నిలుస్తామని తెలిపారు.

## బిజెపి సమావేశానికి తరలివెళ్లిన ఉప్పల్ నేతలు

**ఉప్పల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** బోయిన్‌పల్లిలో జరిగిన బిజెపి సమావేశానికి ఉప్పల్ సర్కిల్‌నుంచి పలువురు నేతలు తరలివెళ్లారు. బిజెపి సీనియర్ నాయకులు శామీర్‌పేట ధర్మారెడ్డి, యు.బి.చారి, దేవసాని బాలచందర్, అర్బన్ జిల్లా అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, చేతన తదితరులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర ఇంచార్జీ తరుణ్‌చుగ్ పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు.

## కార్మిక చట్టాలను కాలరాసే ప్రభుత్వాలను గద్దెదింపుతాం : సిపిఐ నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 10 ప్రభాతవార్త:** కార్మిక చట్టాలను కాలరాసే ప్రభుత్వాలను గద్దెదించుతామని చట్టాల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపుతో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో గురువారం హయత్‌నగర్‌లో నిర్వహించిన మహాపడావ్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికవర్గాన్ని బానిసలుగా చేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. స్వతంత్ర పోరాటానికి ముందు రక్తం చిందించి సాధించుకున్న చట్టాలను ప్రభుత్వ ప్రభుత్వం కాలరాయడం దారుణమన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరంతర ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏడాదికి కోటి ఉద్యోగాలిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటుపరంచేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవడానికి, వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడానికి క్విట్ ఇండియా లాంటి మరో ఉద్యమం చేయడానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముత్యాల యాదిరెడ్డి, నాయకులు సామిడి శేఖర్‌రెడ్డి, హరిసింగ్‌నాయక్, సక్రునాయక్, వెంకన్న, రాములు, శ్రీనివాస్‌సాగర్, అరుణ, సుభద్ర, వేణు పాల్గొన్నారు.